# కథానిక




'డైరీ అంటే మన శత్రువుని మనకి పరిచయం చేసే అంతర్ముఖం.'

తను అతిగా అభిమానించే మామయ్య రాసిన గొలుసుకట్టు తెలుగు వాక్యం ఆ డైరీ మొదటి పేజీలో కనిపించింది శశాంకకి. ఆ వాక్యాన్ని అతను చదవడం ఎన్నోసారో అతనికే తెలీదు. కొన్ని వేలసార్లు చదివాడతను.

ఆ డైరీ అంటే శశాంకకి ఇష్టం. తనని రచయితని చేసింది ఆ డైరీనే అని అతని నమ్మకం. అతని పద్నాలుగో ఏట ఆఫీస్ కేంప్ మీద పెద్దాపురం వచ్చినప్పుడు శశాంక పుట్టినరోజని తెలిసింది. ఆ డైరీలోని ఆ వాక్యం రాసి ప్రజెంట్ చేశాడాయన.

"అంతర్ముఖం అంటే ఏమిటి మామయ్యా?" అడిగాడు శశాంక.

చిన్నగా నవ్వి జవాబు చెప్పాడాయన. "నువ్వు చిన్నప్పటినించి నాకు తెలును. పరిచయస్థులు, శత్రువులే తప్ప నాకు మిత్రుడనేవాడు లేడని బాధపడ్డ రోజు లేదు. మనశ్శాంతి కరవైన రోజు దీంట్లో రానుకుంది చదువు. అప్పుడు నీకే తెలుస్తుంది. నువ్వు ఎవరు, ఎక్కడనించి ఎక్కడికి వెళ్ళావు - ఆ రోజు నీకు అర్థం అవుతుంది. బహుశా అప్పటికి నీ వయసు పద్నాలుగే అయి ఉంటుంది."

శశాంకకి అర్థం కాలేదా మాటలు.

"మనసులో మథనపడేవి, బయటకి చెప్పుకోలేని నీ ఫీలింగ్స్ ఇందులో రాసుకో."

శశాంక వాటితోపాటు తనకి నచ్చిన కొటేషన్స్, కవితలు లాంటివి కూడా రాసుకుంటున్నాడు. తరచు వాటిని తన కవితల్లో వాడుతుంటాడు.

శశాంకకి ఆ రోజు మనశ్శాంతి పూర్తిగా కరవైంది. అందుకు కారణాలు అనేకం. ప్రధాన కారణం భరద్వాజ.

ఓ మాత్రని వేసుకుని, కొద్దిగా నీళ్ళు తాగి పడుకున్నాడు. అకస్మాత్తుగా ఆ డైరీ గురించి తన మామయ్య చెప్పింది గుర్తు రావడంతో లేచి, ఆ డైరీలోని ఒకో పేజీని తిరగేయసాగాడు.

ఓ చోట ఆగాడు.

'పది ఓటమిల తర్వాత వచ్చే గెలుపే అతిపెద్ద గెలుపు.'

అదేసందర్భంలో రాసుకున్నాడో గుర్తొచ్చింది. ఢిల్లీ ఆఫీసుకి కేంప్‌కి వెళుతూ తన మొదటి కథ పదోసారి కూడా తిరిగి వచ్చిందన్న బాధతో ఏడ్చాక రాసుకున్నాడు.

పదకొండోసారి ఆ కథ అచ్చయితీరాలని నిశ్చయించుకున్నాడా రాత్రి దొడ్డిదారిన.

హైదరాబాద్ తిరిగి వచ్చాక లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీ సబ్ - ఎడిటర్‌ని కలిశాడు. కథలన్నీ చదివి పడపోసేది అతనే. చాలా కేజువల్‌గా చెప్పాడతనితో.

"మీకు స్కూటర్ లోన్ కావాలనుకుంటే నన్ను గుర్తుంచుకోండి."

మొదటి కథ ఆ విధంగా ప్రచురింపబడింది. అది ఫలానా ఇంగ్లీష్ కథకి ఆధారం అని పాఠకులనించి వచ్చిన లెటర్స్ వేశారు ఆ పత్రికలో. కానీ, ఆ తర్వాత అతను రాసిన చిన్న నవల కూడా ఓ ఇంగ్లీష్ నవల ఆధారంగా రాసిందే. అది అతనికి కాలేజీలో నాన్ డిటైల్డ్ టెక్స్ట్‌లోదే.

అంతకుపూర్వం ఓ రచయిత కాపీ రచయిత అని తేలితే, అతనికి పారితోషికం పంపకుండా, అతని పేరు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచే సత్సంప్రదాయం ఉండేది.

అయితే, శశాంక విషయంలో అలా జరగలేదు. ఇంకో వాక్యం చదివాడు.

'జీవితంలో తొలిసారిగా ఏ ఎడిటర్ అయినా స్కాచ్ తాగితే, అది శశాంక ఇచ్చిందే అయుండాలి.'

అది రాసి, కింద తన సంతకం చేసి తారీకు వేశాడు జ్ఞానేశ్వర్. అతను ఓ వారపత్రిక ఎడిటర్. నాలుగో పెగ్గు తర్వాత తనే రాయించేస్తున్నాడది - మానవుడి బలహీనతల మీద తను సవారీ చేయగలనన్న సమర్థతకి సావనీర్‌గా.

శశాంకకి పారితోషికం ఓ లెక్కలోది కాదు. సంఘంలో 'అతనే శశాంక' అని అంతా చెప్పుకునే గుర్తింపు కోసం వెంపర్లాడుతున్న సమయం అది. క్రికెట్ ఎలాగూ ఆడలేడు. సినిమా హీరో కాలేడు, తను పొట్టి కాబట్టి.

అందుకని రచయిత అయాడు. ఆ రోజుల్లో రచయితలంతా గుమాస్తా ఉద్యోగాల్లో ఉండే మధ్యతరగతివాళ్ళే. ఓ ఎడిటర్‌ని బార్‌కి తీసుకెళ్ళే అవసరం, ఆర్థిక స్తోమత లేనివాళ్ళే అంతా. ఆ విషయాన్ని ఆకళింపు చేసుకున్నాక చకచక పావులని కదిపాడు శశాంక. ఎడిటర్స్‌ని (తన కంపెనీ ఖర్చుతో) బార్‌లకి తీసుకెళ్ళడం, చిన్న చిన్న బహుమతులు ఇవ్వడం చేయసాగాడు.

ఫలితంగా 'ఫలానా ఇంగ్లీష్ నవలని సీరియల్‌గా రాశాను' అని చెప్పి మరీ నవల ఇచ్చేవాడు. వాళ్ళు 'నో' అనలేని మొహమాటం. ప్రపంచం మొత్తం 'అది ఫలానా ఇంగ్లీష్ నవలకి కాపీ' అని అరిచినా శశాంకకాని, ఎడిటర్స్‌కాని పట్టించుకోలేదు.

ఈ పరిస్థితిలో శశాంక నిచ్చెనలోని ఆఖరి మెట్టుకి చేరుకోవాలంటే, అక్కడ ఆల్‌రెడీ ఉన్న భరద్వాజ ప్రతిబంధకం అయాడు.

మధ్యతరగతి కుటుంబ జీవన విధానాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకున్న భరద్వాజ రచనలు



పాఠకులు ప్రత్యేక అభిమానంతో చదవడంతో శశాంక కొత్త ప్రణాళికల్ని సిద్ధం చేసుకున్నాడు.

'గమ్యం చేరడం ముఖ్యం. అది ఏ దారి అన్నది పట్టించుకోనవసరం లేదు' అన్న వాక్యాన్ని రానుకున్నాడు డైరీలో.

భరద్వాజకి, తనకి గల తేడాని పరిశీలించాడు. అతను గజిబిజి లేకుండా, కథనాన్ని సూటిగా అల్లి, దాన్ని తేలిక వాక్యాల్లోకి రూపొందించి పాఠకులకి అందించగలడు. అతనికి రైటింగ్ క్రాఫ్ట్‌లో వీక్ పాయింట్ అన్నదే లేదు. కానీ, శశాంకకి చక్కటి చదివించే శైలి ఉంది తప్ప, ప్లాట్‌ని రూపొందించుకుని కథని అల్లగలిగే సమర్థత లేదు.

తను భరద్వాజని అధిగమించాలంటే, అతని కన్నా బాగా ప్లాట్స్‌ని డెవలప్ చేయగలగాలి లేదా అతన్ని అణగదొక్కాలి.

షార్ట్ కట్స్ శశాంకకి వెన్నతో పెట్టిన విద్య.

"మనిద్దరం కలిసి జంటగా ఓ నవల రాద్దాం." భరద్వాజని అడిగాడు.

అందువల్ల అతని పాఠకులు అతని పేరుతోపాటు తన పేరు గుర్తించాలని, ఉత్తరాల ద్వారా అతని పేరు అణగదొక్కాలన్నది శశాంక పథకం. అయితే, భరద్వాజ అందుకు అంగీకరించలేదు.



భరద్వాజని రచయితగా అణగదొక్కే ప్రయత్నాలు ఆరంభించాడు. ఒక్క పేజీ కథలు భరద్వాజ బాగా రాస్తాడన్న పేరుంది. ఓ వీక్లీలో ప్రతి వారం అలాంటి కథలు రాస్తున్నాడు భరద్వాజ. చదరంగంలోని ఓ పావుని కదిల్చాడు శశాంక.

ఆ వీక్లీ ఎడిటర్‌కి రిలయన్స్ డిస్కౌంట్ కూపన్స్ ఇచ్చాడు. పదివేలు 'క్యాష్ లోన్' ఇచ్చాడు. తన సీరియల్ మొదలయ్యాక, ఓ స్కాచ్ బాటిల్ సగం ఖాళీ అయ్యాక అడిగాడు.

"భరద్వాజ ఒంటి పేజీ కథ ఉంటేకాని మీ పత్రిక అమ్ముడుపోదా?"

"అదేంటి సార్ అలా అంటున్నారు?"

"నా సీరియల్‌వల్ల సర్క్యులేషన్ పెరిగిందా లేదా తెలుసుకోవాలంటే, అతని పేరు లేకపోవడం బెటర్ అని. అంతే... రేపు జీతం వచ్చాక నా లోన్ తీరుస్తారా?"

భరద్వాజ కథలు ఆ పత్రికలో ఆగిపోయాయి. ఆ ఎడిటర్ బాగా ముదురు. వాళ్ళిద్దరి స్నేహం పెరిగింది.

శశాంకకి క్లియర్‌గా అర్థమయింది, ఏ పత్రిక ఎడిటర్‌నయినా లొంగదీసుకోవడం తేలికని.

భరద్వాజ రాసే సీరియల్‌ని శశాంక ఓ వారపత్రికలో, ఓ దినపత్రికలో మధ్యలో ఆపించేశాడు. అందుకు కరెన్సీ చేతులు మారింది. తను రాసే సబ్జెక్ట్‌తో (ఇద్దరూ ఒకే ఇంగ్లీష్ నవలని కాపీ కొట్టారు) ఇంకో రచయిత అదే పత్రికలో రాస్తున్న సీరియల్‌ని ఆపించేశాడు.

శశాంకకి భరద్వాజని ఓడించడం, కేవలం తన పేరు మాత్రమే కమర్షియల్ రచనారంగంలో వెలగాలన్న దుగ్ధ అధికం అయింది. కానీ, భరద్వాజ స్థానం చెక్కుచెదరలేదు. శశాంక 'ఇతరత్రా' పైకి వస్తుంటే, భరద్వాజ తన రచనా సమర్థతని పెంచుకుంటూ, మౌనంగా ఎదుగుతూ, పోటీని తట్టుకుంటూ వస్తున్నాడు.

అతను రచయితగా ఎంటర్ కానప్పటి 'రచయిత భరద్వాజ' వేరు. శశాంక ఎంటర్ అయి షార్ట్ కట్స్ ద్వారా ఇబ్బంది పెట్టాక 'రచయిత భరద్వాజ' వేరు. ఎంతో ఎత్తుకి ఎదిగాడు భరద్వాజ. అప్పట్లో హాస్యం రాయలేని భరద్వాజ ఇప్పుడు ఊపిరి పీల్చుకుని వదిలినంత తేలిగ్గా, ఆహ్లాదంగా రచనని

డైరీలో విజయగర్వంతో రానుకున్నాడు.

'డబ్బూ లేక అమ్మాయి ప్రతి మగాడి బలహీనత.'

ఎం.బి.ఎలో తను చదివిన మార్కెటింగ్ టెక్నిక్స్ అన్నీ ఉపయోగించాడు. సబ్బు ఎలాంటి గ్లామర్ లేని వస్తువు. దాన్ని అమ్మాలంటే దానికి గ్లామర్ నివ్వాలి. అంచేత సినిమా తారల సబ్బుగా ప్రచారం చేశారు. ఇదే పద్ధతిని అనుసరించాడు శశాంక.

తన పేరుని పాపులర్ చేయసాగాడు. భరద్వాజ పేరుని తొక్కించే ప్రయత్నం చేయసాగాడు. ఏ పత్రిక ఎడిటర్ శశాంక మాట వినడో, ఆ పత్రికలో మాత్రమే భరద్వాజ సీరియల్స్ వస్తున్నాయి. శశాంక హస్తం ఉన్న పత్రికల్లో కేవలం శశాంక, అతను ఎన్నిక చేసినవారి సీరియల్స్ మాత్రమే వస్తున్నాయి. భరద్వాజ సీరియల్ బావుందని వచ్చే లేఖల ప్రచురణని ఆపించాడు. తన ఫోటోలు గుప్పించాడు.

అంతదాకా తెలుగు రచయితలంతా మధ్యతరగతివాళ్ళే. ఆర్థికంగా ఇమేజ్ ఉన్నవారు అరుదు. శశాంక పాఠకుల్లో తనకి అలాంటి ఇమేజ్‌ని ఏర్పరచుకునే ప్రయత్నాలు చేశాడు. డబ్బుని అంతా ప్రేమిస్తారు. దాంతో పేరున్న రచయితగా, ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించే రచయితగా, ఏర్‌కండిషన్డ్ గదిలో నవల రాసే రచయితగా, ఆడ అభిమానులు తన వెంటపడే రచయితగా ప్రాజెక్ట్ చేయించుకున్నాడు.

చాలామంది ఎడిటర్స్‌ని ఎలా చెప్తే అలా వినే స్థితికి శశాంక తీసుకువచ్చాడు. స్కాచ్, తిరిగి ఇవ్వలేని క్యాష్ లోన్స్, తన పేరున వాళ్ళే సీరియల్ రాసి పారితోషికం తీసుకోనడం, అభిమానుల పరిచయాలు.... ఒక ఎడిటర్ నిరాకరిస్తూ చెప్పాడు.

"భరద్వాజ రచనలు వేసేవారంతా మా శత్రువులంటే ఎలాగండీ?"

చేయగలుగుతున్నాడు. నేలకేసి కొట్టిన బంతిలా అతన్ని ఎంత అణగదొక్కాలని ప్రయత్నిస్తే, అంతగా ఎదుగుతున్నాడు. అయితే, శశాంకకి తెలీదు ఈ విషయం.

భరద్వాజ తన మీదకి శశాంక విసిరిన ప్రతి రాయినీ అందుకుని తిరిగి విసరలేదు. వాటితో ఇల్లు కట్టుకున్నాడు.

సినిమాల్లో రాణించాలంటే క్రియేటివిటీ అవసరం. శైలి తప్ప ఇంకే క్రియేటివిటీ లేని శశాంక గ్లామర్ అక్కడ ఎక్కువకాలం పని చేయలేదు. స్కాచ్‌లకి, క్యాష్‌లోన్స్‌కి ఆశపడే మధ్యతరగతి ఎడిటర్స్ కారు వారు. అక్కడ చెల్లుబాటుకాక తిరిగి వచ్చాక శశాంకకి భరద్వాజ మీద క్రోధం ఇంకాస్త అధికం అయింది. ఏనాడూ సినిమా ఇండస్ట్రీ వెంటపడలేదు భరద్వాజ. అయినా, శశాంక కన్నా భరద్వాజ కథలే ఎక్కువగా సినిమాలుగా వచ్చాయి. అదో మానసిక దిగులు శశాంకకి.

శశాంక - దూరమైన తన తెలుగు పాఠకులకి తిరిగి దగ్గరవ్వాలని ప్రయత్నించాడు. విసురుదామంటే శశాంక గ్లామర్ మొత్తం ఖర్చయిపోయింది.

శశాంక పైకి ఎగబాకిన పద్ధతిని గ్రహించిన మరో నలుగురయిదుగురు అతనిలానే 'సబ్బూ - సినిమా తార' సామెతగా పైకి వచ్చేసి ఉన్నారు. తనకి తెలీకుండానే తన చేతివేళ్ళ మధ్య నుంచి జారిపోయిన తన పాపులారిటీని తలచుకుంటే కళ్ళనీళ్ళు వచ్చాయి శశాంకకి.

అతని జీవితేచ్ఛ నెరవేరలేదు. నిచ్చెన ఆఖరి మెట్టున తను కూర్చోవాలన్న కోరిక తీరకపోవడానికి భరద్వాజ కారణం. అతను అప్పటి నుంచి ఒక్క మెట్టు కూడా కిందికి దిగలేదు. అదే పద్ధతిలో ఉన్నాయి అతని బుక్ సేల్స్.

ఒకప్పుడు తన పేరు రిజర్వ్ బేంక్ లాంటిది. కానీ, ఇప్పుడది దివాలా తీసిన సహకార బేంక్ స్థాయికి దిగజారింది అని తెలుసుకున్నాడు శశాంక. ఎలాగంటే...

ఏ కొత్త పత్రిక పెట్టినా, వాళ్ళు ముందు ఏజంట్స్‌ని అడుగుతారు ఎవరి సీరియల్ వేయాలని. భరద్వాజ పేరే సూచిస్తారంతా. భరద్వాజ సీరియల్ తోనే మొదలవుతాయి అన్ని పత్రికలూ.

ఏజంట్స్ సర్వేలో తన పేరు రాక పోయినా, కొత్త ఎడిటర్స్‌ని తనదైన పద్ధతిలో ఆకట్టుకోలేకపోయాడు. కారణం - అక్కడ సాధారణంగా ప్రొప్రయిటర్, ఎడిటర్ ఒక్కరే తప్ప, పెద్ద పత్రికల్లో లాగా వేరువేరు కారు. తన పేరుకున్న గ్లామర్ పోయిందని తెలిశాక ఓ కొత్త పేరుని సృష్టించాడు. ఓ పంజాబీ మోడలింగ్ గర్ల్‌తో కాంట్రాక్ట్ రాయించుకుని ఫోటోలు తీయించాడు. ఆమె లైఫ్ హిస్టరీకి ఓ అద్భుతమైన ప్రొఫైల్‌ని తయారుచేశాడు. మళ్ళీ క్యాష్‌లోన్స్ సహాయంతో ఆ పేరుతో పది సీరియల్స్ ఘోస్ట్ రైటర్స్ సహకారంతో ప్రచురింప జేశాడు. అయితే, పాఠకులు గతంలోలా అమాయకులు కారని, తనకన్నా ఎంతో ఎత్తు ఎదిగారని ఆలస్యంగా తెలుసుకున్నాడు. ఆ కొత్త పేరుకి చేసిన ఖర్చు కూడా తిరిగిరాలేదు.



భరద్వాజ చెక్కుచెదరకుండా రచయితగా సాగిపోతున్నాడు. పుష్కరం పాటు తను ఎంత ప్రయత్నం చేసినా కంచుకోటలా చెక్కుచెదరని భరద్వాజ మీద కసి ఇంకాస్త ఎక్కువైంది.

ఈసారి కొత్త పథకాన్ని రూపొందించాడు. చిన్న గెస్ట్‌హౌస్, ఔత్సాహిక రచయిత్రుల శిక్షణశాల, పేకాట, ఇండియన్ విస్కీ - అలాంటి జీవితాన్ని ఎరగని వాళ్ళకి ఆహ్వానం.

దాదాపు రెండేళ్ళు పట్టింది శశాంక పథకం పూర్తి అవడానికి. రెండు వారాల్లో సీరియల్ పూర్తవుతుందనగా, భరద్వాజ నవలలు బయటికి వచ్చేవి కానీ, ఇప్పుడు ఆర్నెల్లయినా రావడం లేదు. శశాంక తను గెలిచాననుకున్నాడు.

కానీ, మళ్ళీ తను విసిరిన రాతిని కొత్త ఇంటికి ఇటుకగా వాడుకున్నాడని తెలిసింది శశాంకకి.

లేచి బుక్‌షెల్ఫ్‌లో భరద్వాజ పంపిన నవలలు చూశాడు. పాతిక నవలలు మొత్తం. భరద్వాజ సొంతంగా ప్రచురించుకున్న నవలలవి. అన్నిట్లోను 'శుభమస్తు - భరద్వాజ' అని రాసి పంపాడు. పెట్టుబడి అతనిదే. రాబడి అతనిదే. ఇప్పుడు అతని సంపాదన పెరిగింది. తన వల్లే పెరిగింది.

ఆ అశాంతితో నిద్రపట్టడం లేదు శశాంకకి. మూడు నిద్రమాత్రలు వేసుకుని మంచినీళ్ళు తాగాడు. అయిదు నిమిషాలు అటు, ఇటు మంచం మీద దొర్లాడు. అలనాడు ద్రౌపది తనని చూసి నవ్విన దుర్యోధనుడు ఎలా ఫీలయ్యాడో అర్థం అయింది శశాంకకి.

ఇప్పుడు భరద్వాజ ఏం చేస్తుంటాడు? హాయిగా నిద్రపోతుంటాడు. ఎందుకు? తను? ఎందుకు? విసురుగా లేచి రిసీవర్ అందుకున్నాడు. భరద్వాజ ఇంటి నంబర్ తిప్పాడు. ఆరు సార్లు మోగాక భరద్వాజ కంఠం వినిపించింది.

"భరద్వాజ హియర్!"

"శశిని."

"చెప్పండి. ఎలా ఉన్నారు?"

"మీరెలా ఉన్నారు?"

చిన్నగా నవ్వు. అంతే.

"ఆమధ్య ఓ కథ రాశాను. అది మీమీద అన్నారు ఒకరిద్దరు. మిమ్మల్ని ఉద్దేశించి రాయలేదని చెప్తామని ఫోన్ చేశాను."

"ఇట్సాల్ రైట్."

ఏమిటి తను? తను ఇన్ని చేసినా మౌనం. చిద్విలాసం. అంతేతప్ప ఎదురు తిరగడే? 'ఎందుకిలా చేశారు' అని గద్దించడే.

"ఒకవేళ మీమీద రాశానని మీరనుకుంటే, మీరు నామీద ఓ కథ రాయండి. చెల్లుకు చెల్లు." కవ్వింపుగా చెప్పాడు.

"నిజంగా రాయనా?"

"మీకు చేతనయితేనే సుమా!"

కొద్ది క్షణాల తర్వాత భరద్వాజ అడిగాడు.

"మీరిన్ని చేసినా, నేను ఎందుకు మిమ్మల్ని ద్వేషించడం లేదన్నది మీ బాధ కదా! తనలో అందరిని, అందరిలో తనని చూసుకోగలిగేవాడు ఎవర్నీ ద్వేషించలేడు శశీ!"

"వేదాంతంలోకి దిగారా?" వెటకారంగా నవ్వాడు శశాంక.

"ఇతరులు తనకి ఏం చేయకూడదనుకుంటారో, అది ఇతరులకి చేయకుండా ఉండగలగడం మాస్టర్ సి.వి.వి యోగవల్ల నేర్చుకున్నాను. గత పదహారేళ్ళుగా సి.వి.వి శిష్యుడిని నేను."

శశాంకకి అది కొత్త విషయం. "రేపు మాట్లాడదాం. లోకస్సమస్తా సుఖినో భవంతు. శుభరాత్రి మిస్టర్ శశీ." అవతలి వైపు ఫోన్ పెట్టేశాడు భరద్వాజ.

శశాంక కొన్ని క్షణాలు మౌనంగా కిటికీలోంచి ఆకాశం వంక చూస్తూ ఉండిపోయాడు.

అప్పుడు అర్థమైంది శశాంకకి, అంతర్ముఖమంటే ఏమిటో, తన శత్రువు ఎవరో, తనకి మనశ్శాంతి ఎందుకు కరవైందో?

మామయ్య చెప్పింది నిజమే. తనకిప్పుడూ పద్నాలుగేళ్ళే. ■